TELUGU NEWS TIMES


# తెలుగు న్యూస్ టైమ్స్

జాతీయ దిన పత్రిక

J.M.Nayudu
Cell: 91 9840066999
SCCI
Sai Charan Comfort Inn
(Luxury Service Apartments)
Plot No. 1286 & 1345, 5th Street, Golden Colony,
Anna Nagar West Extn., Mugappair, Chennai-50.
Mobile : +91 9840089859, E-mail : saicomfortinn@gmail.com

సంపుటి : 3 | సంచిక : 235 | ఆదివారం 15 డిసెంబరు 2024 | పేజీలు : 4 | వెల రూ. 3 | ఎడిటర్ : సిహెచ్. ముకుంద రావు | 9043514736, 9840467131 | online E-paper

## ఏపీలో ఎన్నికలు 2029లోనే




**అమరావతి :** దేశంలో జమిలి అమల్లోకి వచ్చినా.. మన రాష్ట్రంలో 2029లోనే ఎన్నికలు జరుగుతాయని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. 'ఒక దేశం-ఒకే ఎన్నిక' విధానానికి ఇప్పటికే మద్దతు ప్రకటించినట్లు వెల్లడించారు. జమిలి నేపథ్యంలో రాష్ట్రంలో త్వరలోనే ఎన్నికలు రానున్నాయని, తామే అధికారంలోకి వస్తామంటూ వైకాపా నేతలు చేస్తున్న వ్యాఖ్యల్ని ప్రస్తావించగా.. జమిలిపై అవగాహన లేని వైకాపా నాయకులు ఏదిపడితే అది మాట్లాడుతున్నారని మండిపడ్డారు. శనివారం మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయానికి వచ్చిన సీఎం కొంతసేపు మీడియాతో మాట్లాడారు. శుక్రవారం వైకాపా శ్రేణులు నిర్వహించిన ఆందోళనల్ని ప్రస్తావించగా.. ఆ పార్టీ నేతలు ఎప్పుడో విశ్వసనీయత కోల్పోయారని, వారి నాటకాలు చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. స్వర్ణాంధ్ర విజన్-2047 గురించి అడగ్గా.. దాన్ని మరింతగా ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. 'విశ్వవిద్యాలయాలు, కళాశాలలు, పాఠశాలలతో పాటు ప్రతిచోటా దానిపై చర్చ జరగాలి. భవిష్యత్తు తరాల బాగు కోసం చేసే ఈ ప్రయత్నంలో అందరూ భాగస్వాములు కావాలి. విజన్-2020 సాకారమై వాటి ఫలాల్ని నేడు ప్రజలు పొందుతున్నారు. 2047లోనూ ఇదే పునరావృతం అవుతుంది. విజన్-2020 అమలు చేసిన తీరు నేటితరం తెలుసుకోవాలి. 1996 నాటి ఏపీ పరిస్థితులు, 2020 నాటి పరిస్థితుల్ని బేరీజు వేసుకుంటే విప్లవాత్మక మార్పులు కనిపిస్తాయి' అని చంద్రబాబు స్పష్టం చేశారు. సహకార, సాగునీటి సంఘాలు సహా అన్ని ఎన్నికల ప్రక్రియల్ని షెడ్యూల్ ప్రకారమే పూర్తి చేయనున్నట్లు తెలిపారు.

**ఇక సుదీర్ఘ సమీక్షలుండవు..** ఈసారి నిర్వహించే కలెక్టర్ల సమావేశంలో మార్పులు తీసుకురానున్నట్లు చంద్రబాబు వివరించారు. 'సుదీర్ఘ సమీక్షలకు తావివ్వకుండా ప్రశ్నలు-సమాధానాల రూపంలో నిర్వహిస్తాం. కలెక్టర్లు, ఎస్పీలకు ముందుగానే చర్చించాల్సిన అంశాల గురించి వివరాలు పంపి సమాధానాలు కోరతాం. దీంతో సమయం సద్వినియోగం కావడంతో పాటు మంత్రులు, అధికారుల మధ్య సమన్వయం పెరుగుతుంది' అని పేర్కొన్నారు.



## 11 జిల్లాలకు అతి తీవ్ర కరవు, వరదల ముప్పు

**దిల్లీ:** దేశంలోని 11 జిల్లాలకు భీకర వరదలు, తీవ్ర దుర్భిక్షం ముప్పు పొంచి ఉందని ఓ నివేదిక హెచ్చరించింది. ఐఐటీ గువాహటి, ఐఐటీ మండీ కలిసి సెంటర్ ఫర్ స్టడీ ఆఫ్ సైన్స్, టెక్నాలజీ అండ్ పాలసీ (సీఎస్టీఈపీ) సహకారంతో జిల్లా స్థాయి పర్యావరణ మదింపు నివేదికను విడుదల చేశాయి. దీని ప్రకారం.. 51 జిల్లాలకు వరదలకు సంబంధించి అతి తీవ్రముప్పు పొంచి ఉండగా 118 జిల్లాలు తీవ్రమైన ముప్పు జాబితాలో ఉన్నాయి. 91 జిల్లాలు అతి తీవ్రమైన, 188 జిల్లాలు తీవ్రమైన కరవు బారిన పడే ప్రమాదముంది. మరీ ముఖ్యంగా బిహార్‌లోని పట్నా, కేరళలోని అలప్పుజ, ఒడిశాలోని కేంద్రపడ జిల్లాలు సహా 11 జిల్లాలు తీవ్రమైన కరవు, వరదలకు గురయ్యే పరిస్థితులు ఉన్నాయని ఈ నివేదిక పేర్కొంది. వాతావరణ మార్పులను అందరూ కలిసి కట్టుగా ఎదుర్కోవాలనే అంశాన్ని ఈ నివేదిక నొక్కి చెబుతోందని ఐఐటీ గువాహటి డైరెక్టర్ దేవేంద్ర జలిహాల్ పేర్కొన్నారు. ఈ దుష్పరిణామాల్ని ఎదుర్కోవడానికి కేంద్ర, రాష్ట్ర, స్థానిక ప్రభుత్వాలు సమన్వయంతో కలిసి పనిచేయాలని సూచించారు.



## రైతుల 'చలో దిల్లీ' ఉద్రిక్తం



**చండీగఢ్:** దేశ రాజధాని దిల్లీ సరిహద్దులోని శంభు ప్రాంతంలో రైతులు శనివారం చేపట్టిన 'చలో దిల్లీ' కార్యక్రమం ఉద్రిక్తతకు దారితీసింది. నిరసన తెలియజేస్తున్న రైతులపై పోలీసులు బాష్పవాయువు, జల ఫిరంగులను ప్రయోగించారు. కనీస మద్దతు ధర సహా 11 డిమాండ్ల సాధన కోసం 101 మంది అన్నదాతలు నినాదాలు చేస్తూ పంజాబ్, హరియాణా రైతులు మధ్యాహ్నం 12 గంటలకు దిల్లీ వైపునకు బయలుదేరారు. హరియాణా భద్రతా సిబ్బంది ఏర్పాటు చేసిన బారికేడ్ల వద్దకు వారు చేరుకోగానే పోలీసులు, పారామిలిటరీ బలగాలు రంగంలోకి దిగి వారిని నిలువరించారు. ఈ క్రమంలో కొందరు రైతులు గాయపడ్డారు. వెంటనే వారిని దగ్గరలోని ఆసుపత్రికి తరలించారు. మొత్తం 17 నుంచి 18 మంది కర్షకులు గాయపడ్డారని, ఈ నేపథ్యంలో శనివారం చేపట్టిన యాత్రను నిలిపివేస్తున్నట్లు పంజాబ్‌కు చెందిన రైతు నేత సర్వన్ సింత్ పంధేర్ విలేకరులకు తెలిపారు.

అంతకు ముందు నిరసన ర్యాలీకి దిల్లీ నుంచి అనుమతుల కోసం అంబాలా డీసీపీ పార్థ గుప్తా, అంబాలా ఎస్పీ ఎస్ఎస్ భోరియా రైతులతో అరగంటపాటు చర్చలు జరిపారు. చివరకు అనుమతుల్లేకుండానే దిల్లీ దిశగా సాగేందుకు రైతులు నిర్ణయించారు. ఈ నెల 6 నుంచి అన్నదాతలు దిల్లీ వైపుగా వెళ్లేందుకు ప్రయత్నిస్తున్నారు. శనివారంతో కలిపి మూడోసారి వారి ప్రయత్నాన్ని పోలీసులు భగ్నం చేశారు. తాజా మార్చ్‌ను దృష్టిలో పెట్టుకొని హరియాణా ప్రభుత్వం అంబాలాలోని 12 గ్రామాల్లో మొబైల్ ఇంటర్నెట్, గంపగుత్త ఎస్ఎంఎస్ సేవలను నిలిపివేసింది. శనివారం ఉదయం ఆరు గంటల నుంచి 17వ తేదీ అర్ధరాత్రి వరకు సేవలను నిలిపివేస్తున్నట్లు ఓ ప్రకటనలో తెలిపింది.

## రిజర్వేషన్లలో మార్పుల జోలికి వెళ్లం

**దిల్లీ:** ప్రస్తుతం దేశంలో అమలవుతున్న రిజర్వేషన్ల విధానంలో మార్పులు చేర్పులకు వీలులేదని మోదీ ప్రభుత్వం కృతనిశ్చయంతో భావిస్తోందని కేంద్ర హోంమంత్రి అమిత్ షా పేర్కొన్నారు. ముస్లింలకు రిజర్వేషన్లు కల్పించడం ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల కోటాను బలహీనపరిచిందని ఆరోపించారు. 'ఎజెండా ఆజ్‌తక్ 2024' కార్యక్రమంలో శనివారం పాల్గొన్న అమిత్ షా.. 2026, మార్చి 31 నాటికి దేశం నక్సలైట్ల హింస ముప్పు నుంచి బయటపడుతుందన్నారు. మణిపుర్‌లో మైతేయ్, కుకీ సామాజిక వర్గాలతో ప్రభుత్వం చర్చలు జరుపుతోందని, త్వరలో పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నట్లు వెల్లడించారు. జమ్మూకశ్మీర్‌లో హింస గణనీయంగా తగ్గిందని, లోక్‌సభ, శాసనసభ, స్థానిక ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని పేర్కొన్నారు.

## లోక్‌సభ ముందుకు జమిలి ఎన్నికల బిల్లు



**దిల్లీ:** లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీలకు ఏకకాలంలో ఎన్నికల నిర్వహణకు ఉద్దేశించిన 'ఒకే దేశం-ఒకే ఎన్నిక' ప్రణాళికను పార్లమెంటు ముందుకు తీసుకుకొచ్చేందుకు రంగం సిద్ధమైంది. దీనికోసం ప్రతిపాదించిన 129వ రాజ్యాంగ సవరణ బిల్లును సోమవారం కేంద్ర న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ లోక్‌సభలో ప్రవేశపెట్టనున్నట్లు అధికార వర్గాలు వెల్లడించాయి. తరచూ ఎన్నికల నిర్వహణ వల్ల వ్యయప్రయాసలతో పాటు సమయం వృథా అవుతోందని బిల్లు లక్ష్యాలు, కారణాల్లో ప్రభుత్వం వివరించింది. జమిలి ఎన్నికల వల్ల ప్రజాధనం, సమయం ఆదా అవుతుందని పేర్కొంది. పదేపదే ఎన్నికల ప్రవర్తనా నిబంధనలను అమలుచేయాల్సిన అవసరం ఉండదు కనుక అభివృద్ధి పనులు నిరాటంకంగా జరుగుతాయంది. ఎన్నికల విధులకు మానవ వనరుల వినియోగం తగ్గి ప్రభుత్వ ఉద్యోగుల సేవలు మరింతగా అందుబాటులోకి వస్తాయని తెలిపింది. ఈ కారణాల రీత్యా జమిలి ఎన్నికల నిర్వహణ దేశానికెంతో అవసరమని బిల్లులో అభిప్రాయపడింది. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలతో పాటే స్థానిక సంస్థల ఎన్నికలనూ నిర్వహించాలని మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆధ్వర్యంలోని కమిటీ ప్రభుత్వానికి సిఫార్సు చేసింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయాన్ని ప్రస్తుతానికి పక్కనబెట్టిన కేంద్ర మంత్రిమండలి.. లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికల కోసం రూపొందించిన రెండు బిల్లులకు ఈ నెల 12న ఆమోదం తెలిపింది.



## ఈవీకేఎస్ ఇలంగోవన్ మృతి : స్టాలిన్ నివాళులు

**విల్లివాకం న్యూస్:** తమిళనాడు కాంగ్రెస్ కమిటీ సీనియర్ నాయకుడు, ఈరోడ్ తూర్పు అసెంబ్లీ సభ్యుడు ఈవీకేఎస్ ఇలంగోవన్ అనారోగ్య కారణాలతో శనివారం తుదిశ్వాస విడిచారు. ఆయన మృత దేహాన్ని మనపాక్కంలోని నివాసంలో ఉంచారు. ఈవీకేఎస్ ఇళంగోవన్ భౌతికకాయానికి రాజకీయ నేతలు, వాలంటీర్లు నివాళులు అర్పిస్తున్నారు. ఈవీకేఎస్ ఇళం గోవన్ భౌతిక కాయానికి ముఖ్యమంత్రి ఎం.కె.స్టాలిన్ స్వయంగా నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులకు సాను భూతి తెలిపారు. ఆయన వెంట ఉపముఖ్య మంత్రి ఉదయనిధి స్టాలిన్, మంత్రులు దురైమురుగన్, ఎం. సుబ్రమణియన్ తదితరులు ఇళంగోవన్ మృతదేహానికి నివాళులర్పించారు.

## ఇవికెఎస్ ఇలంగోవన్ మృతి పట్ల ఏఐటిఎఫ్ సంతాపం



**విల్లివాకం న్యూస్:** కాంగ్రెస్ సీనియర్ నేత, తందై పెరియార్ మనవడు, మాజీ కేంద్ర మంత్రి, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు, ఈరోడ్ ఈస్ట్ సిట్టింగ్ ఎమ్మెల్యే ఇవికెఎస్ ఇలంగోవన్ (75) మృతి పట్ల అఖిల భారత తెలుగు సమాఖ్య దిగ్భ్రాంతి వ్యక్తం చేసింది. 5వ అఖిల భారత తెలుగు మహాసభల సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖర్ రెడ్డి సమక్షంలో కామరాజ్ ఆరంగం (2007)లో ఆయనను సత్కరించడం జరిగింది. ఆయన కుటుంబ సభ్యులకు మా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నామని, ఆయన ఆత్మ శాంతి కోసం ప్రార్థిస్తున్నట్లు ఏఐటిఎఫ్ అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.



## డీఎంకే కార్యవర్గ సమావేశం వాయిదా



**గిండి న్యూస్:** 18న జరగనున్న డీఎంకే కార్యవర్గ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు డీఎంకే తెలిపింది. ప్రధాన కార్యదర్శి దురైమురుగన్ సందర్భంగా ఆయన ఒక ప్రకటనలో... తమిళనాడుకు భారీ వర్షం హెచ్చరిక జారీ చేయడంతో పాటు ప్రస్తుతం జరుగుతున్న పార్లమెంట్ సమావేశంలో మా సభ్యులు ముఖ్యమైన అంశాలపై చర్చించాల్సి ఉన్నందున 18.12.2024న చెన్నైలో డీఎంకే కార్యవర్గ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. ప్రస్తుతం ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం వాయిదా పడింది. డిఎంకె ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం తేదీని తర్వాత ప్రకటిస్తారని పేర్కొన్నారు.

## ఇవికేఎస్ ఇలంగోవన్ మృతి : విజయ్ సంతాపం




**గిండి న్యూస్:** తమిళనాడు కాంగ్రెస్ కమిటీ సీనియర్ నేత, ఈరోడ్ అసెంబ్లీ సభ్యుడు ఈవీకేఎస్ ఇళంగోవన్ శనివారం కన్నుమూశారు. ఈ సందర్భంగా తమిళగ వెట్రి కళగం అధ్యక్షుడు విజయ్ విడుదల చేసిన సంతాప సందేశంలో..గొప్ప రాజకీయ వారసత్వం కలిగిన తండ్రి పెరియార్ కుటుంబ సభ్యుడు, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ మాజీ అధ్యక్షుడు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు, కేంద్ర జౌళి శాఖ మాజీ మంత్రి, ప్రస్తుత ఈరోడ్ ఈస్ట్ అసెంబ్లీ సభ్యుడు ఇ.వి.కె.ఎస్. ఇళంగోవన్ అనారోగ్య కారణాలతో మరణించారనే వార్త తెలిసి నేను చాలా బాధపడ్డాను.ఆయన కుటుంబ సభ్యులకు, కాంగ్రెస్ సభ్యులకు నా ప్రగాఢ సానుభూతి. ఇళంగోవన్ ఆత్మకు శాంతి కలగాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నానని పేర్కొన్నారు.

## మృతుల కుటుంబాలకు ఓపీఎస్ సానుభూతి



**విల్లివాకం న్యూస్:** దిండుగల్‌లోని మృతుల కుటుంబాలకు మాజీ ముఖ్యమంత్రి ఓ.పన్నీర్ సెల్వం సానుభూతి ప్రకటించారు. ఆయన విడుదల చేసిన ప్రకటనలో ఇలా తెలిపారు. దిండుగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ బాలుడు సహా ఏడుగురు మరణించారని, ఊపి రాడక ముప్పై మందికి పైగా ప్రభుత్వాసుపత్రిలో చేరారని తెలుసుకుని తీవ్ర ఆవేదనకు గుర య్యాను. ఈ అగ్ని ప్రమాదంలో ప్రాణాలు కోల్పో యిన వారి కుటుంబాలకు నాప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను. కొన ఊపిరితో కొట్టు మిట్టాడుతూ ప్రభుత్వాసుపత్రిలో చేరిన వారు త్వరగా కోలుకుని ఇంటికి తిరిగి రావాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నాను. అలాగే, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చేరిన వారికి నాణ్యమైన చికిత్స అందించాలని తమిళనాడు ప్రభుత్వాన్ని కోరుతున్నాను.

## ప్రపంచ చెస్ ఛాంపియన్ గుకేష్‌కు ఏఐటిఎఫ్ అభినందనలు



**విల్లివాకం న్యూస్:** చైనాకు చెందిన డింగ్ లిరెన్‌ను ఓడించి, ప్రపంచ చెస్ ఛాంపియన్ (మిస్టర్ విశ్వనాథ్ ఆనంద్ తర్వాత 2వ భారతీయుడు) అయినందుకు దొమ్మరాజు గుకేష్ (18)కి అఖిల భారత తెలుగు సమాఖ్య (ఏఐటిఎఫ్) అభినందనలు తెలియజేసింది. టైటిల్ గెలుచుకున్న ఆసియా నుండి 3వ ఆటగాడిగా, అతను తమిళనాడును, ముఖ్యంగా తెలుగు సమాజాన్ని గర్వించేలా చేసారు. అతను రికార్డులో అతి పిన్న వయస్కుడిగా నిలిచారు. అతను అసాధారణ ప్రతిభతో మరెన్నో అవార్డులు గెలుచుకోవాలని కోరుకుంటున్నట్లు ఏఐటిఎఫ్ అధ్యక్షులు ప్రొఫెసర్ సీఎంకే రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు.

## వరద సాయం అందజేతలో జాప్యం లేదు : శేఖర్ బాబు



**అన్నానగర్ న్యూస్:** చెన్నైలోని వాటర్ ట్యాంక్ స్ట్రీట్, వాల్టాక్స్ రోడ్‌లో చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ నిర్మిస్తున్న 700 కొత్త ఫ్లాట్ల పనులను, చెన్నైలోని తంగసాలై మెంబాలం, స్టాన్లీ హాస్పిటల్ సమీపంలో 776 కొత్త ఫ్లాట్ల పనులను హిందూ ధార్మిక శాఖ మంత్రి పీకే శేఖర్‌బాబు స్వయంగా సందర్శించారు.చెన్నై మెట్రో పాలిటన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌ను సందర్శించి క్షేత్రస్థాయి సర్వే నిర్వహించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. 14.03.2024న చెన్నైలోని గోల్డెన్ రోడ్‌లో రూ.2,097 కోట్ల విలువైన 87 ప్రాజెక్టులను ముఖ్యమంత్రి ప్రారంభించారు. ఈ పథకాన్ని వివిధ శాఖలు విస్తరించాయి. ఇప్పుడు ఇది రూ.6,309 కోట్ల అంచనాలతో 252 ప్రాజెక్టులకు పెరిగింది.అలాగే ముఖ్యమంత్రి సహాయ నిధిని పరిస్థితిని బట్టి బాధిత ప్రజలకు చేరవేస్తామని తెలిపారు.

## రాబోయే ఎన్నికలు ఏకగ్రీవంగా ఉంటాయన్న నూకసాని బాలాజీ



**ఒంగోలు న్యూస్ :** ఆంధ్రప్రదేశ్ టూరిజం డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఏపీటీడీసీ) చైర్మన్ డాక్టర్ నూకసాని బాలాజీ, ఎర్రగొండపాలెం నియోజక వర్గంలో జరిగిన టీడీపీ ఎన్నికల పర్యవేక్షణ కార్యక్రమంలో మాట్లాడుతూ, రాష్ట్రంలో రాబోయే అన్ని ఎన్నికలు ఏకగ్రీవంగా జరుగుతాయనే అభిప్రాయం వ్యక్తం చేశారు.ప్రజలు చంద్రబాబు నాయుడు నాయకత్వాన్ని విశ్వసించి, ఆయన పరిపాలన పట్ల పూర్తి మద్దతు చూపుతున్నారు.వైసీపీ ప్రభుత్వంపై ప్రజలు విశ్వాసాన్ని కోల్పోయారని, జగన్‌మోహన్ రెడ్డితో పోటీ చేసే పరిస్థితి లేదని వ్యాఖ్యానించారు. రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చేపడుతున్న ప్రణాళికలు, ముఖ్యంగా అమరావతి రాజధాని నిర్మాణం, పర్యాటక రంగ అభివృద్ధి వంటి రంగాల్లో దృష్టిని నిలిపారు. అదేవిధంగా, టూరిజం రంగానికి ఇండస్ట్రియల్ స్టేటస్ ఇచ్చిన కారణంగా పెట్టుబడులు పెరుగుతాయని, ఉపాధి అవకాశాలు ఎక్కువగా కలుగుతాయని చెప్పారు. ప్రజలు స్థిర అభివృద్ధి కోసం టీడీపీకి మద్దతు ఇస్తారని, కూటమి ఆధ్వర్యంలో రాబోయే ఎన్నికలు జరగబోతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## నేడు బిగ్‌బాస్-8 ముగింపు.. భారీ బందోబస్తు

**జూబ్లీహిల్స్:** బిగ్‌బాస్ సీజన్ 8 ముగింపు నేపథ్యంలో 300 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసేందుకు పశ్చిమ మండల పోలీసులు నిర్ణయించారు. జూబ్లీహిల్స్‌లోని అన్నపూర్ణ స్టూడియోలో బిగ్‌బాస్ షో జరుగుతోంది. విజేతను ఆదివారం ప్రకటించనున్నారు. గత ఏడాది డిసెంబరు 17న బిగ్‌బాస్-7 విజేతగా పల్లవి ప్రశాంత్‌ను ప్రకటించిన అనంతరం ఆయన స్టూడియో నుంచి బయటకు వచ్చాక అభిమానుల అత్యుత్సాహంతో పరిస్థితి అదుపు తప్పి ఏడు ఆర్టీసీ బస్సులు, పలు కార్ల అద్దాలు ధ్వంసమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈసారి పోలీసులు ముందస్తుగా బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.



# ఉన్నత విద్యను అభ్యసించడంలో అమెరికాతో పోటీ పడాలి



**వేలూరు న్యూస్:** ఉన్నత విద్యను అభ్యసించడంలో ఇండియా అమెరికాతో పోటీ పడాలని వేలూరు వీఐటీ యూనివర్శిటీ చాన్సలర్ విశ్వనాథన్ అన్నారు. వీఐటీ చాన్సలర్ జన్మ.దినోత్సవాన్ని పురష్కరించుకొని వేలూరు తలముర్రై పేరవై, నారాయణి ఆసుపత్రిసంయుక్తంగా నేతాజీ మార్కెట్, మండీ వీధిలోని కార్మికుల కోసం ప్రత్యేక వైద్య శిబిరం వేలూరు టౌన్ హాలులో జరిగింది. ఈ శిబిరాన్ని వేలూరు తలముర్రై పేరవై నిర్వహకులు శ్రీనివాసన్, భూమినాథన్, పీడికే మారన్, వీ.శ్రీనివాసన్, సతీష్, కేఎస్ సుందర్తదితరులు ఏర్పాటు చేయగా చాన్సలరర్ ప్రారంభించి ప్రసంగిం చారు. మన అభివృద్ధికి విద్య, ఆరోగ్యం ముఖ్య పాత్ర వహిస్తుందన్నారు. విద్యలో అభివృద్ధి చెందితే మన ఆదాయం కూడా పెరుగుతుందన్నారు. కుటుంబం కూడా ఆర్థికంగా అభివృద్ధిచెందు తుంద న్నారు. ఉన్నత విద్యలో తమిళనాడు ముందంజలో ఉందని తమిళ నాడులోనే వేలూరు జిల్లా వెనుకంజలో ఉందన్నారు. దీంతోనే వీఐటీలో అందరికీ ఉన్నత విద్యా పథకాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు.

## మీంజూర్ పోలీస్ స్టేషన్‌కి కొత్త రూపు: అదనపు పోలీసు కమిషనర్ రాజేంద్రన్ సందర్శన

**పొన్నేరి న్యూస్ :** తిరువళ్లూరు జిల్లా మీంజూర్ పోలీస్ స్టేషన్‌కి కొత్త రూపు అందింది. ప్రస్తుతం ఈ పోలీస్ స్టేషన్‌లో: లా అండ్ ఆర్డర్ ఇన్‌స్పెక్టర్ మహిత అన్నీ క్రిస్టీ, క్రైమ్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్ మహిత అన్నీ క్రిస్టీ, శాంతి, పరమ కీర్తి, జగన్మోహన్, సెంథిల్ కుమార్, పళనివేల్,స్పెషల్ పోలీస్ అసిస్టెంట్ ఇన్‌స్పెక్టర్ సెల్వం తదితరులు తమ బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. వారి ఉమ్మడి ప్రయత్నాల వల్ల పోలీస్ స్టేషన్‌లో టైల్స్ వేసిన అంతస్తులు, పెయింట్ చేసిన గోడలు, ఆకర్షణీయమైన మొక్కలు ఏర్పాటు చేయబడ్డాయి. తాజా రూపంతో పోలీస్ స్టేషన్ మరింత ఆకర్షణీయంగా మారింది.



తమిళనాడు అదనపు పోలీసు కమిషనర్ రాజేంద్రన్ స్వయంగా ఈ కొత్త రూపు పొందిన పోలీస్ స్టేషన్‌ను సందర్శించి అభినందించారు. ఈ సందర్శనలో ఆవడి కమిషనరేట్ అసిస్టెంట్ కమీషనర్ ఆఫ్ పోలీస్ రాజా రాబర్ట్ కూడా పాల్గొన్నారు.

## వినోదం అంచున విషాదం.. సినిమా థియేటర్ల చుట్టూ వివాదాలు




**హైదరాబాద్ :** ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని సంధ్య 70 ఎంఎం థియేటర్.. ఎక్కువగా ఇక్కడ పెద్ద హీరోల సినిమాలు విడుదల చేస్తారు. ఈ ఏడాది మొదట్లో ప్రముఖ హీరో సినిమా తొలిరోజు చూసేందుకు భారీగా అభిమానులు వచ్చారు. ప్రధానగేటు తీయగానే లోపలకు నెట్టుకుంటూ వెళ్లటంతో కొందరు కిందపడిపోయారు. కిందపడిన ముగ్గురు యువతులు ఊపిరాడక ఇబ్బంది పడ్డారు. అక్కడున్న కానిస్టేబుల్ గమనించి బయటకు తీయడంతో ప్రమాదం నుంచి తప్పించుకున్నారు. అదే ప్రాంతంలోని మరో థియేటర్ వద్ద అభిమానుల మధ్య తలెత్తిన వివాదం గొడవకు దారితీసింది. ఇద్దరు యువకుల తలకు తీవ్రగాయాలు కావటంతో ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స చేయించిన యాజమాన్యం పోలీసు కేసుకాకుండా జాగ్రత్తపడ్డారు. ఇటీవల ఇదేచోట ప్రముఖ నటుడి కటౌట్ ఏర్పాటు చేస్తూ ఒక యువకుడు విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. ఇవి కేవలం ఉదాహరణలు మాత్రమే. కళ్లెదుట ప్రమాదాలు జరుగుతున్నా పోలీసులు కన్నెత్తి చూడరు. దీంతో థియేటర్ల యాజమాన్యాల నిర్లక్ష్యవైఖరి మారట్లేదనే ఆరోపణలున్నాయి. కొత్త సినిమా విడుదలైతే వారం ముందునుంచే థియేటర్ల వద్ద హంగామా ఉంటుంది. భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు, అభిమానుల కోలాహలం సరేసరి. పండగ వాతావరణాన్ని తలపించే చోట తరచూ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయి. హద్దు దాటిన అభిమానం కొన్నిసార్లు విషాదానికి కారణమవుతోంది. ఈ నెల 4న పుష్ప-2 ప్రీమియర్‌షో వీక్షించేందుకు వచ్చిన అల్లు అర్జున్‌ను చూసేందుకు భారీగా అభిమానులు చేరటంతో తొక్కిసలాటకు దారితీసింది. ఈ ప్రమాదంలో మహిళ మృతిచెందింది. ఈ ఘటనను ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తుండటంతో పోలీసు యంత్రాంగం అప్రమత్తమైంది. నిబంధనలు పాటించకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. థియేటర్ల యాజమాన్యం, మేనేజర్లతో సమావేశానికి పోలీసు అధికారులు సిద్ధమయ్యారు.

ఆర్టీసీ క్రాస్‌రోడ్డులోని థియేటర్లలో సినిమాలు వీక్షించేందుకు సాధారణ ప్రేక్షకులు ఆసక్తి చూపుతారు. ప్రేక్షకులే కాదు.. దశాబ్దాల నుంచి సినీతారలు తాము నటించిన సినిమాలను సంధ్య, దేవి థియేటర్లలో కుటుంబంతో కలసి వీక్షించడాన్ని సెంటిమెంట్‌గా భావిస్తుంటారు. నటీనటులు వస్తున్నారనే సమాచారంతో అభిమానులు, జనం భారీగా చేరుతారు. ఊహించనంత జనాన్ని అదుపు చేయటం అరకొర సిబ్బందితో కుదరక పోలీసులు చేతులెత్తేస్తున్నారు.

నగరంలోని సినిమా థియేటర్ వద్ద ఏర్పాటు చేసిన కథానాయకుడి కటౌట్ వద్ద అభిమానులు బాణసంచా కాల్చారు. నిప్పురవ్వలు కటౌట్‌పై పడటంతో క్షణాల్లో మంటలు వ్యాపించాయి. చందానగర్‌లోని మరో థియేటర్‌లో అకస్మాత్తుగా వ్యాపించిన మంటలతో స్థానికులు ఉక్కిరిబిక్కిరయ్యారు. కొన్ని మల్టీప్లెక్స్‌ల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంటుందని ఒక ఇన్‌స్పెక్టర్ తెలిపారు. అక్కడ తినుబండారాల ధరల గురించి ప్రశ్నించిన ప్రేక్షకులను బౌన్సర్లు బెదిరిస్తున్నట్టు తమకు ఫిర్యాదులు వస్తున్నట్టు చెప్పారు.



# తిరువన్నామలైలో భక్తుల గిరి ప్రదక్షణ


**అన్నానగర్ న్యూస్:** శుక్రవారం తిరువణ్ణామలైలో మహా దీప ఉత్సవాలు అట్టహాసంగా జరిగాయి. 2,688 అడుగుల ఎత్తైన పర్వత శిఖరంపై సాయంత్రం 6 గంటలకు మహా దీపం వెలిగించారు. మహాదీపాన్ని చూసేందుకు దేశ, విదేశాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చి అరోగరా అంటూ భక్తిశ్రద్ధలతో దీప దర్శనం చేసుకున్నారు. వారు తమ తలలపై చేతులు ఎత్తి పర్వతానికి నమస్కరించారు. చాలా మంది ఇళ్లు, దుకాణాల ముందు అకల్ దీపాలు వెలిగించారు. కొండపై మహా దీపం వెలిగించిన సందర్భంగా నగరంలోని పలు ప్రాంతాల్లో ఆకాశ సరదాలు ప్రదర్శించారు.దీంతో తిరువణ్ణామలై నగరమే వెలిగిపోయింది.

## టోకెన్లు ఉన్న భక్తులకే వైకుంఠ ద్వార దర్శనం

**తిరుమల :** వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీవారి ఆలయంలో జనవరి 10 నుంచి 19వ తేదీ వరకు టోకెన్లు ఉన్న భక్తులకు మాత్రమే వైకుంఠ ద్వార దర్శనాలకు అనుమతిస్తామని తితిదే శనివారం ఓ ప్రకటనలో తెలిపింది. సామాన్య భక్తులకు అధిక ప్రాధాన్యమిస్తూ తితిదే పలు నిర్ణయాలు తీసుకుంది. టోకెన్లు లేని భక్తులను తిరుమలకు అనుమతించినా దర్శనం చేసుకునే అవకాశం లేదు. గోవిందమాల భక్తులకు ఎలాంటి ప్రత్యేక దర్శనాలు ఉండవు. చంటిబిడ్డలు, వృద్ధులు, దివ్యాంగులు, రక్షణ శాఖ, ఎన్‌ఆర్‌ఐ తదితరులకు కల్పించే విశేష దర్శనాలను రద్దు చేశారు. ప్రొటోకాల్ ప్రముఖులకు మినహా వీఐపీ బ్రేక్ దర్శనాలు లేవు. మాజీ ప్రజాప్రతినిధులు, మాజీ బ్యూరోక్రాట్లు, మాజీ ఛైర్మన్లకు వైకుంఠ ఏకాదశి రోజున దర్శనానికి అనుమతి ఉండదు. భారీ క్యూలైన్లు నివారించి గరిష్ఠ సంఖ్యలో భక్తులకు వైకుంఠద్వార దర్శనాలు కల్పించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్లలో పొందిన టైంస్లాట్ ప్రకారమే భక్తులు క్యూలైన్ వద్దకు చేరుకోవాల్సి ఉంటుంది.



# కశ్మీర్ లోయకు రైళ్ల చుక్‌చుక్



**జమ్మూ:** దీర్ఘకాలంగా ఎదురుచూస్తున్న దిల్లీ-కశ్మీర్ రైలు సర్వీసు ప్రాజెక్టు విషయంలో పెద్ద ముందడుగు పడింది. శ్రీ మాతా వైష్ణోదేవీ ఆలయ పర్వత పాదాల వద్ద కీలకమైన టి-33 సొరంగానికి సంబంధించిన తుది విడత పనులు పూర్తయ్యాయి. దీంతో కాట్రా, రియాసీ జిల్లాల మధ్య రైల్వే సంధానత ఏర్పడింది. ఇది చరిత్రాత్మక మైలురాయి అని రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ పేర్కొన్నారు. “ఉధంపుర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లింక్‌కు సంబంధించిన తుదివిడత ట్రాక్ పనులు పూర్తయ్యాయి. 3.2 కిలోమీటర్ల పొడవైన టి-33 సొరంగ మార్గంలో కంకర రహిత ట్రాక్ పనులు శుక్రవారం విజయవంతంగా పూర్తయ్యాయి” అని ఆయన వెల్లడించారు. దేశంలోని మిగతా ప్రాంతాల నుంచి కశ్మీర్‌కు నేరుగా రైళ్లను నడిపేందుకు ఉధంపుర్-శ్రీనగర్-బారాముల్లా రైల్వే లైన్ (యూఎస్‌బీఆర్‌ఎల్)ను రైల్వేశాఖ చేపట్టింది. ఈ ప్రాజెక్టు సాకారానికి టి-33 సొరంగ మార్గమే తుది అడ్డంకి. అందులో ప్రధానమైన ట్రాక్ పని పూర్తయింది. చిన్నచిన్న పనులు మాత్రమే మిగిలున్నాయి. అవి కూడా ఈ నెల 20 నాటికి పూర్తవుతాయని రైల్వే అధికారులు చెబుతున్నారు. దీంతో కశ్మీర్ లోయకు రైలు మార్గం సిద్ధమవుతుంది. డిసెంబరు 20 తర్వాత నుంచి ఈ రైల్వే లైన్‌లో ప్రయోగాత్మకంగా రైళ్లను నడుపుతామని అధికారులు తెలిపారు. అంతా అనుకున్నట్లే జరిగితే జనవరి చివరినాటికి కశ్మీర్ లోయకు పూర్తిస్థాయిలో రైలుమార్గం సిద్ధమవుతుందన్నారు. వచ్చే నెల 26న ఈ మార్గంలో వందేభారత్ రైలు నడుస్తుందని చెప్పారు. తద్వారా దిల్లీ నుంచి కశ్మీర్ లోయకు చేరే తొలి రైలుగా చరిత్ర సృష్టిస్తుందని, అక్కడి ప్రజల కల నెరవేరుతుందని తెలిపారు.

## ఏపీలో రెడ్ బుక్ పాలన

**ఢిల్లీ:** ఏపీలో రాజ్యాంగం బదులుగా రెడ్ బుక్ పాలన జరుగుతోందని ఎంపీ గురుమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. రాజ్యాంగంపై లోక్‌సభలో చర్చ సందర్భంగా వైఎస్సార్‌సీపీ తరఫున ఆయన పాల్గొన్నారు. టీడీపీ ఇచ్చిన హామీలు అమలు చేయలేక పోతోందని.. కూటమి ప్రభుత్వం కేవలం వట్టి మాటలకే పరిమితమైందన్నారు. గత వైఎస్ జగన్ ప్రభుత్వం సామాజిక న్యాయానికి, పారదర్శకతకు అద్దం పట్టిందన్న గురుమూర్తి.. జగనన్న విద్యా దీవెన, అమ్మఒడి, వైఎస్సార్ చేయూత లాంటి పథకాలు అణగారిన వర్గాలకు ఎంతగానో ఉపయోగపడ్డాయన్నారు. ఈ పథకాలు ఆయా వర్గాలను పైకి తీసుకొచ్చాయి. ఎస్సీ, ఎస్టీ, బీసీల అభ్యున్నతికి పెద్ద ఎత్తున నిధులు కేటాయించి, వారి అభివృద్ధికి పాటుపడ్డారు. రాజ్యాంగం ఒక జీవన పత్రం. అసమానతలను తగ్గించే ఒక సాధనం రాజ్యాంగం. సామాజిక న్యాయం, స్వేచ్ఛ, సోదర భావనకు రాజ్యాంగం పెద్దపీట వేసింది. కేశవానంద భారతి కేసు రాజ్యాంగం పునాదులను మరోసారి నిర్వచించింది. 75 ఏళ్ల ఈ రాజ్యాంగ ప్రయాణంలో ఎంతో ప్రగతి సాధించాం.” అని ఎంపీ గురుమూర్తి పేర్కొన్నారు.

“ప్రపంచంలోనే అద్భుతమైన ప్రజాస్వామ్య దేశంగా భారత్ అవతరించింది. అనేక కోట్ల మంది ఓటర్లు ప్రజాస్వామ్య ప్రక్రియలో పాలుపంచుకున్నారు. మన రాజ్యాంగ సంస్థలపై విశ్వాసాన్ని ప్రకటించారు. అంటరానితనాన్ని నిర్మూలించేందుకు నిర్ణయాత్మక చర్యలు తీసుకున్నారు. వ్యవసాయ ఎకానమీ నుంచి ప్రపంచంలోనే ఐదో ఆర్థిక శక్తిగా ఎదిగింది.

.అక్షరాస్యతలో 74 శాతం సాధించాం. జీవన స్థాయి 70 ఏళ్లకు పెరిగింది. వాతావరణం మార్పులు జీ-20 విషయాల్లో భారత ప్రపంచం నాయకత్వం వహిస్తుంది. పెరుగుతున్న ఆర్థిక సమానతలు ఇంకా సవాలుగానే పరిణమిస్తున్నాయి. ఆర్థిక అసమానతలు, లింగ అసమానత్వాన్ని రూపుమాపితేనే నిజమైన సమానత్వం వస్తుంది” అని ఎంపీ గురుమూర్తి చెప్పారు.

## అన్ని కాలేజీలకు ఒకే ఫీజు సరికాదు

**అమరావతి:** పీజీ మెడికల్, డెంటల్ కోర్సులకు రాష్ట్రంలోని మెడికల్, డెంటల్ కాలేజీలన్నింటిలో ఏకీకృత ఫీజు సరికాదని హైకోర్టు స్పష్టం చేసింది. ఏపీ ఉన్నత విద్య నియంత్రణ, పర్యవేక్షణ కమిషన్ (ఏపీహెచ్‌ఈఆర్‌ఎంసీ) సిఫారసుల మేరకు 2020-21 నుంచి 2022-23 విద్యా సంవత్సరాలకు ఫీజును ఖరారు చేస్తూ ప్రభుత్వం 2020 మే 29న జారీ చేసిన జీవో 56ను రద్దు చేసింది. ఈ జీవో చట్టం ముందు నిలబడదని స్పష్టం చేసింది. ఏపీహెచ్‌ఈఆర్‌ఎంసీ అన్నీ మెడికల్, డెంటల్ కాలేజీలను ఒకే గాటన కట్టి, ఏకీకృత ఫీజు నిర్ణయించడం చట్ట విరుద్ధమన్న కాలేజీల వాదనతో హైకోర్టు ఏకీభవించింది. ఆ కాలేజీలు ప్రతిపాదించిన ఫీజుల వివరాలను పరిగణనలోకి తీసుకుని తిరిగి ఫీజు ఖరారు చేయాలని, ఆపైన రెండు నెలల్లో ఆదేశాలు జారీ చేయాలని కమిషన్‌ను ఆదేశించింది.ఒకవేళ ప్రతిపాదించిన ఫీజుతో కాలేజీలు విభేదిస్తే, ఆ కాలేజీ యాజమాన్యం అభిప్రాయాలు తెలుసుకున్న తర్వాతే తగిన ఉత్తర్వులు జారీ చేయాలంది. కమిషన్ ఫీజులను పెంచితే, పెంచిన మేర బ్యాలెన్స్ మొత్తాలను అభ్యర్థుల నుంచి వారిచ్చిన హామీ మేరకు కాలేజీలు వసూలు చేసుకోవచ్చని చెప్పింది. అదనపు ఫీజు వసూలులో నిర్ణయం అంతిమంగా కాలేజీలదేనని స్పష్టం చేసింది. జీవో 56ను సవాలు చేస్తూ దాఖలైన పలు పిటిషన్లపై విచారణ జరిపిన ప్రధాన న్యాయమూర్తి (సీజే) జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్, న్యాయమూర్తి జస్టిస్ రావు రఘునందన్ రావు ధర్మాసనం ఈ ఏడాది సెప్టెంబర్‌లో విచారణ జరిపి, తీర్పును రిజర్వ్ చేసింది. గురువారం తీర్పు వెలువరించింది. ఏకీకృత ఫీజు విద్యార్థుల ప్రయోజనాలకు కూడా విరుద్ధం కావొచ్చునని హైకోర్టు తీర్పులో పేర్కొంది. తక్కువ ఫీజు ఉంటే మరింత ఎక్కువ చెల్లించాలని విద్యార్థులను కాలేజీలు బలవంతం చేయవచ్చునని తెలిపింది. ఏకీకృత ఫీజు వల్ల తగిన మౌలిక సదుపాయాలు, నాణ్యమైన బోధనా సిబ్బంది లేని కాలేజీలు లాభపడే అవకాశం ఉందని పేర్కొంది.



## ఊరికి బంధువులొస్తున్నారు

**హరిలో రంగ హరి.. అంటూ హరిదాసులు.. అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు.. అంటూ డూడూబసవన్నలు.. అంబ పలుకు.. జగదంబ పలుకు అంటూ.. జంగమదేవరలు.. ఓ లప్పో.. లచ్చిమప్పో.. అంటూ.. కొమ్మదాసుల విన్యాసాలతో పెద్ద పండుగను నెల రోజుల ముందే వెంటేసుకొస్తారు.. సంక్రాంతికి అందరి ఇళ్లకు బంధువులు పండుగకు మూడు, నాలుగు రోజుల ముందు వస్తే.. ‘ఊరికి బంధువులు’ మాత్రం నెలగంట మోగిన వెంటనే ఇళ్ల ముందు ప్రత్యక్షమవుతూ సందడి చేస్తారు.. సంప్రదాయ కళలకు పట్టం గడుతూ.. తృణమో పణమో ఆనందంగా తీసుకుని అందరూ చల్లగా ఉండాలని దీవిస్తూ ధనుర్మాసంలో ఊరూవాడా తిరుగుతుంటారు. సోమవారం నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుంది.**

సూర్యుడు ధనుస్సు రాశిలో ప్రవేశించడంతో ధనుర్మాసం మొదలవుతుంది. దీనిని ధనుస్సంక్రమణమని, నెల పట్టడం అని పల్లె నానుడి. ఈనెల 16న (సోమవారం) నుంచి ధనుర్మాసం ప్రారంభం కానుంది. జనవరిలో మకర సంక్రమణం వరకు ధనుర్మాసం ఉంటుంది. ఈ నెలరోజుల పాటు ఉదయాన్నే హరినామ సంకీర్తలు పాడుతూ హరిదాసులు, డూడూ బసవన్నలతో విన్యాసాలు చేయిస్తూ గంగిరెడ్ల వారు, పప్పుదాకలో పడిపోతున్నానంటూ కొమ్మదాసులు, అంబ పలుకు జగదంబ పలుకంటూ బుడబుక్కల వాళ్లు, శంఖం ఊదుతూ జంగం దేవరలు, ఏడాదికో మారంటూ పిట్టల దొరలు, భట్రాజులు, సోదెమ్మలు, పగటి వేషగాళ్లు, కనికట్టు చేసేవాళ్లు, గారడీ చేసేవాళ్లు వరుసగా క్యూ కడుతుంటారు.

ఆయా జాతుల వారు ఊళ్లను పంచుకుని తమతమ పరిధిలోని గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి తమ కళలను ప్రదర్శించి వినోదాన్ని పంచి యజమానులు ఇచ్చిన మొత్తాన్ని తీసుకువెళుతుంటారు. పల్లె జీవనానికి ఈ సంప్రదాయ కళలకు ఎంతో అనుబంధం ఉందని పెద్దలు చెబుతుంటారు. మారుతున్న కాలంలో ఆదరణ తగ్గి ఉపాధి కోసం జిల్లాలోని చాలా మంది కళాకారులు వేరే వృత్తుల్లో స్థిరపడగా, కొందరు మాత్రం తమ తాతల కాలం నుంచి వస్తున్న విద్యను ప్రదర్శిస్తూ సంప్రదాయ కళలను కాపాడుకుంటూ వస్తున్నారు. సోమవారం నుంచి ఊరూరు తిరిగేందుకు సన్నాహాలు చేసుకుంటున్నారు.

**ఓ లప్పో.. లచ్చిమప్పో..** అక్కో రాఖీ పండక్కొచ్చినప్పుడు నీకు షాపింగ్‌మాల్‌లోంచి కాస్ట్లీ చీరతెత్తానప్పా.. మాయగారు ఆనందంగా ఉండాల. వారానికి 3 సినిమాలకు వెలతుండాల.. నీ కుటుంబమంతా బాగా ఉండాల అంటూ కొమ్మదాసులు మాటల గారడీ చేస్తూ ఆకట్టుకుంటారు. పూర్వం చెట్లు ఎక్కి హడావుడి చేసేవారు. ఇప్పుడు భుజాన కొమ్మేసుకుని తిరుగుతున్నారు.

**గంగిరెడ్లు..** అయ్యగారికి దండం పెట్టు.. అమ్మగారికి దండం పెట్టు అంటూ యజమానికి చెప్పే ఆదేశాలకు తలాడిస్తూ గంగిరెడ్లు చేసే విన్యాసాలు అబ్బురపరుస్తాయి. గంగిరెద్దులు బసవన్నల రూపంలో ఇంటి ముందుకొస్తేనే పండుగ మొదలవుతుంది. గంగిరెడ్ల వారు పీపీలు ఊదుతూ పాటలు పాడుతుంటే గంగిరెద్దుల గజ్జల చప్పుడు మధ్య తమ ఇంటికి లక్ష్మీ కళ వస్తుందని నమ్మకం.

**హరిదాసులు** : శ్రీమద్రమా రమణ గోవిందో హరి.. అంటూ తెలవారకుండానే నుదుటన తిరునామం, నెత్తిన అక్షయపాత్ర, చేతిలో చిడతలు, భుజాన తంబూర, పట్టుధోవతి పంచెకట్టు, మెడలో మాల, కాళ్లకు గజ్జలతో హరిదాసులు వీదివీధి తిరుగుతూ హరినామ సంకీర్తనలు ఆలపించడం అనాదిగా వస్తున్న ఆచారం. వారు నడయాడిన గ్రామం పాడిపంటలతో సుభిక్షంగా ఉంటుందని, హరిదాసు అక్షయపాత్రలో పోసే కాసి బియ్యం తమ ఇంటిని సిరిసంపదలతో నింపుతాయని పల్లె ప్రజలు భావిస్తారు. పండుగ నెల పట్టారంటే ప్రతిరోజూ ఉదయాన్నే ప్లేటులో బియ్యంతో మహిళలు హరిదాసు రాకకోసం పల్లెల్లో ఇంటి ముంగిట వేచి ఉంటారు.

